క్లుప్తంగా

ఉదయం వేళలో పనులకు వెళ్లండి



నవాబుపేట: ఎండలను దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలు ఉదయం వేళలో పనులకు వెళ్లాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలో వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. బంగ్రంపల్లిలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీల మస్టర్లు ఎప్పటికప్పుడు వేస్తూ కూలీలకు కూలి డబ్బులు సమయానికి వచ్చేలా సిబ్బంది చూడాలన్నారు. ఆయన వెంట ఉపాధి ఏపీఓ జ్యోతి ఉన్నారు.

'యుద్ధభేరి' పోస్టర్ ఆవిష్కరణ

హన్వాడ: తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో యూపీఎస్‌పై యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన యూపీఎస్ పెన్షన్ విధానాన్ని నిరసిస్తూ తలపెట్టిన ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ ప్రతినిధులు చంద్రకాంత్, మల్లేష్ కోరారు. తహసీల్దార్, మండల పరిషత్, ఎమ్మార్సీ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిన్నదర్పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సైతం పోస్టర్‌ను ఆవిష్కరించారు. తహసీల్దార్ కిష్టానాయక్, ఎంపీడీఓ యశోద, జీహెచ్‌ఎంలు పద్మావతి, శైలజ, ఆర్‌ఐ పర్వా, పీడీ వేణు పాల్గొన్నారు.

కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల మైదానంలో శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్, సీనియర్ మాస్టర్ కోటకదిర వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు కరాటే బెల్టుగ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతి, లలిత, అశ్విక, అవినాష్, చంద్రవర్ధన్, అభికుమార్ ఎల్లోబెల్టులు, కిరిటి ఆరెంజ్‌బెల్టు, విశ్వనాథ్, నితిష్ కుమార్, ప్రదీప్‌కుమార్ బ్లూబెల్టులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే జైలుకే



రాజాపూర్(బాలానగర్): తాగి వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా కేసులు నమోదు చేసి జైలుకు వెళ్లక తప్పదని బాలానగర్ ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేశారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే వారే బాధ్యులు అవుతారన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు తిరిగితే పోలీస్‌లకు సమాచారమివ్వాలని సూచించారు. యువత మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే వాటిని సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

అడ్డాకుల: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు మంగళవారం క్షేత్ర పర్యటన చేశారు. పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయం, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్, పోలీస్‌స్టేషన్‌ను విద్యార్థులు సందర్శించారు. ఠాణాలో కేసుల నమోదు, కేసుల విచారణ అంశాలపై ఎస్‌ఐ శ్రీనివాస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంక్‌లో నగదు డిపాజిట్, విత్‌డ్రా, రుణాల మంజూరు, రికవరీ గురించి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ నిర్వహణపై విద్యార్థులు ఆరా తీశారు. నిధులు, విధుల గురించి కార్యదర్శి సరస్వతి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు షమీ, జుర్రు నారాయణ, చంద్రకళ, మంజుల, ఆంజనేయులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 7రోజుల జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారుడికి 7 రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. టూటౌన్ పోలీసులు చేసిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో హైదరాబాద్‌కు చెందిన షానవాజ్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపరచగా షానవాజ్‌కు 7రోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో మూడురోజులు అదనంగా జైలు శిక్ష ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. సీఐ ఇజాజుద్దీన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ అధికం చేసినట్లు తెలిపారు.

మహిమాన్వితుడు.. లింగేశ్వరుడు

- ఎప్పటికీ ఎండని కోనేరు
- పంటలపై చల్లితే రోగాలు మాయం
- ఏటా మహా శివరాత్రి ఉత్సవాలు
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



చెన్నరాయుడి గుట్టనుంచి తెచ్చిన లింగాన్ని ప్రతిష్ఠించిన ఆలయం

గండేడ్: మహిమాన్వితుడిగా అంతర్‌గంగ లింగేశ్వరస్వామి ప్రసిద్ధి గాంచారు. మండలంలోని మన్సూర్‌పల్లి వద్ద అంతర్‌గంగ లింగేశ్వరస్వామి దేవాలయం ఉంది. ఆదివారం అమావాస్య వచ్చిందంటే కిటకిటలాడుతుంది. చిన్నపాటి ఆలయమే అయినా ఏటా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. సల్కర్‌పేట్ నుంచి కొత్లాబాద్ వెళ్లే రూట్లో ఉంది. వందేళ్ల క్రితం ఇక్కడ లింగం స్వయంభూగా వెలిసినట్లు చెబుతున్నారు. ఈలింగం చిన్నకోనేరు వద్ద ఉంటుంది. చుట్టు గుట్టలు, బండరాళ్లు కాని ఆకోనేరు మాత్రం ఎండదు. భక్తులు ఆలింగేశ్వరుడిని నమ్మడంతో భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది.



స్వయంభూగా వెలిసిన అంతర్‌గంగ లింగేశ్వర స్వామి

మూడు రోజుల పాటు..

ప్రతి ఏటా శివరాత్రి సమయాన అంతర్‌గంగ జాతర నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు జరిగే ఈఉత్సవాలు కొనసాగుతాయి. మొదటి రోజు శకటోత్సవం, రెండో రోజు కల్యాణం, మూడో రోజు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. శివరాత్రి రోజు ఉపవాస దీక్షలు స్వీకరించిన వారు తండోపతండాలుగా వచ్చి ఉపవాసాన్ని విరమిస్తారు. గండేడ్, మహమ్మదాబాద్, హన్వాడ, కోస్గి మండలాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటారు.

కోనేరులో స్నానం చేసి స్వామివారిని..

ఆదివారం అమావాస్య వచ్చిందంటే అంతర్‌గంగ లింగేశ్వరస్వామిని దర్శించుకుంటారు. భక్తులతో ఈఆలయం కిటకిటలాడుతుంది. కోనేరులో స్నానంచేసి లింగేశ్వరుడిని దర్శించుకుంటే తమ సమస్యలు దూరమవుతాయన్నది భక్తుల నమ్మకం. చిన్న పిల్లలు, రోగాల బారినపడిన వారు, పెళ్లికాని వారితో పాటు పలు ఇబ్బందులున్న వారు స్వామి వారిని దర్శించుకొని కోనేటి నీటిని చల్లుకుంటారు.

రెండు కోనేరులు..

ఆలయం వద్ద రెండు కోనేరులు ఉన్నాయి. ఒకటి భక్తుల స్నానాల నిమిత్తం నిర్మించారు. దాంట్లోనే కాళ్లు చేతులు కడుక్కోవడం స్నానాలు చేయడం వంటివి చేస్తారు. దీనిని మోటర్ల ద్వారా నింపుతారు. ఇంకోటి మాత్రం చిన్నపాటి కోనేరు. చుట్టూ గుట్టలు, బండరాళ్లు ఉన్నాయి. చుక్కనీరు కూడ పరిసర ప్రాంతాల్లో పడని పరిస్థితి. ఏకాలంలో అయినా కోనేరులో అంతే నీటిమట్టం ఉంటుంది. ఇందులో నీరు కొబ్బరి నీళ్లలాగా తెల్లగా ఉండి తాగడానికి తియ్యగా ఉంటాయి. ఇది నడుములోతు మాత్రమే ఉంటుంది. దీని విశేషమేమిటంటే ఇది పూర్తిగా బండరాయి మీద ఉంది. ఏళ్ల తరబడి ఎన్ని కాలాలు పోయినా ఇప్పటి వరకు ఇది మాత్రం ఎండలేదు. ఇదే దీని ప్రత్యేకత. ఆదివారం అమావాస్య రోజు ఈకోనేరులోని నీటిని తీసుకెళ్లి పంటలపై చల్లుతారు. దీంతో పంటలకు సోకిన రోగాలు మాయం అవుతాయన్నది భక్తుల నమ్మకం.

ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం



అంతర్‌గంగ లింగేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం. శకటోత్సవం నిర్వహించడానికి వీలుగా గుట్ట ప్రాంతాన్ని చదునుచేశాం. మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చేశాం. అందరూ సహకరిస్తే పెద్ద ఆలయం నిర్మిస్తాం.

గిరమోని కిష్టయ్య, ఆలయ ధర్మకర్త



కోనేరు

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

- దీపాలతో అలంకరణ
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు



చిన్నచింతకుంట మండలంలోని చిన్నవడ్డేమాన్ రామలింగేశ్వరాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరణ

సాక్షి నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా బుధవారం మహా శివరాత్రిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయా మండలాల్లో, గ్రామాల్లో శివాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎండ నుంచి రక్షణ కోసం చలువ పందిరి నిర్మించారు.

● చిన్నచింతకుంట మండలంలోని చిన్నవడ్డేమాన్ గ్రామ శివారులోని మన్నెపు వాగు సమీపంలో వెలసిన స్వయంభూ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం, లాల్‌కోట, పర్ధిపూరం, చిన్నచింతకుంట, అప్పంపల్లి, తిర్మలాపూరం గ్రామాల్లోని శివాలయాలకు కాషాయపు జెండాలు, దీపాలతో అలంకరించారు.

● నవాబుపేట మండల కేంద్రంలోని పెద్ద శివాలయం గోపురంపై ఉన్న భారీ శివుడి విగ్రహానికి మంగళవారం మెరుగులు దిద్ది ఉత్సవాలకు సిద్ధం చేశారు. లోకిరేవు వీరభద్రస్వామి, కోటచింతల బసవేశ్వరాలయం, నవాబుపేటలోని నీలకంఠస్వామి ఆలయంతో పాటు ఇప్పటూర్ శివాంజనేయ దేవాలయం, ఆదిబసవేశ్వర దేవాలయాలు ఉత్సవాలను ముస్తాబు చేశారు.

● దేవరకద్ర మండల కేంద్రంలోని శివాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాగరణ కోసం అఖండ భజనలు ఏర్పాటు చేస్తున్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ తనిఖీ



సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి

భూత్పూర్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చేపట్టే పనులు, యాక్షన్ ప్లాన్‌ను త్వరగా చేయాలని ఎంపీడీఓ ప్రభాకర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేయాలన్నారు. సిబ్బంది హాజరు, పనులపై ఆరా తీశారు. ఎంపీడీఓ ప్రభాకర్, పీఆర్ ఏఈ స్వామి, ఎంపీఓ శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్ రహమాన్, జెడ్పీ జనరల్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయకుమార్, సీనియర్ అసిస్టెంట్ రవి ఉన్నారు.

శ్రీనీలకంఠస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక హనుమాన్‌నగర్‌లో గల శ్రీనీలకంఠ మల్లికార్జున స్వామి దేవస్థానంలో 35వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ,, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మత్స్యంగ్రహణం, అంకురారోహణం, అఖండ దీప స్థాపన చేశారు. లక్ష్మీగణపతి హోమం, మహాపూర్ణాహుతి పూజలు చేశారు. సాయంత్రం శ్రీనీలకంఠస్వామివారికి 108 కలశాల గంగాజలంతో విశేష అభిషేకం నిర్వహించారు. ఎదుర్కోళ్ల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం శివపార్వతుల కల్యాణం, డోలోత్సవం, దీపోత్సవం, 27న రుద్రాభిషేకం, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజ, పల్లకిసేవలు నిర్వహిస్తున్నట్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడు కొళ్ళ శివశంకర్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



రాజాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ జిల్లాలో పలు పాఠశాలల్లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజాపూర్ మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలతో పాటు కల్లేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈఓ సుధాకర్ పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌రావ్, విష్ణువర్ధన్‌గౌడ్, ఉపాధ్యాయులు హనుమప్ప, సంజీవ్‌రెడ్డి, మోజెస్, రమాదేవి, వెంకటేశ్వర్ పద్మావతి సతీష్‌రాథోడ్, అరుంధతి ఉన్నారు.

● దేవరకద్ర మండలం గుడబండలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు ఘనంగా స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. కలెక్టర్‌గా వైష్ణవి, డీఈఓగా చరణ్ తేజ్, ఎంఈఓగా మహబూబ్, ప్రధానోపాధ్యాయులుగా రాజేశ్వరి పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సాయంత్రం జరిగిన సమావేశంలో అభినందించి బహుమతులు అందజేశారు ఎంఈఓ బలరాం, హెచ్‌ఎం శ్రీనివాసులుగౌడ్, ఉపాధ్యాయులు సుశీల, సుధాలక్ష్మీ, సురేష్‌కుమార్, స్వరూప, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

● అడ్డాకుల మండలంలోని గుడిబండ ఉన్నత పాఠశాల(యూపీఎస్)లో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈఓగా ఇందుమతి, ఎంఈఓగా యోగేశ్వరి, హెచ్‌ఎంగా యామినితో పాటు మరి కొందరు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. అడ్డాకుల ఎంఈఓ కురుమూర్తి కార్యక్రమాన్ని పర్యవేక్షించి ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం శివకుమార్, ఉపాధ్యాయులు సుకన్య, సౌజన్య, బాలచంద్రుడు పాల్గొన్నారు.

● జడ్చర్ల మండలంలోని నసరుల్లాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కలెక్టర్‌గా జి.నవ్య , హెచ్‌ఎంగా బి.నవ్యశ్రీ, డీఈఓగా పూజ, ఎంఈఓగా నాని వ్యవహరించారు. హెచ్‌ఎం నారాయణ, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సుశీల, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బ్యాంక్‌లో అపరిచిత వ్యక్తి హల్‌చల్

జడ్చర్ల: స్థానిక సిగ్నల్‌గడ్డలోని ఎస్‌బీఐ శాఖ కార్యాలయంలో మంగళవారం ఓ అపరిచిత వ్యక్తి హల్‌చల్ చేశాడు. దీంతో భయాందోళనకు గురయ్యారు. బ్యాంక్‌లోకి వచ్చిన వ్యక్తి ఓచర్ రాసి డబ్బులు ఇవ్వకుండానే తమ బంధువుకు బదిలీ చేయాలంటూ సిబ్బందిపై మండిపడ్డాడు. గట్టిగా అరవడంతో సిబ్బంది రెండుసార్లు సైరన్ మోగించారు. డయల్ 100 కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు బ్యాంక్‌కు చేరుకొని ఆ వ్యక్తి వద్ద ఉన్న ఆధార్‌పై గల ఫోన్ నంబర్లకు కాల్ చేశారు. అతను మతిస్థిమితం లేని వ్యక్తిగా చెప్పడంతో అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆలయాలకు విరాళాలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయాల పునర్నిర్మాణ పనులకు దాతలు విరాళాలు ఇస్తున్నారు. మంగళవారం వింజమూరి కృష్ణారెడ్డి, లావణ్య దంపతులు రూ. 27,999 అందజేశారు. రామాంజనేయులు, వెంకటలక్ష్మి దంపతులు రూ.11,116, దొడ్ల రాఘవేంద్రస్వామిరెడ్డి రూ. 11,116 విరాళమిచ్చారు. దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

దళిత వర్గాలకు న్యాయం చేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు చట్టం చేసి మాదిగ నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలు చేపట్టి దళిత వర్గాలకు న్యాయం చేయాలని బహుజన మహనీయుల శోభాయాత్ర కమిటీ కో–ఆర్డినేటర్ సింగిరెడ్డి పరమేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక బుద్ధభవన్ ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి మాదిగ సంఘాలుగా స్వాగతిస్తున్నామని తెలిపారు.

జాతీయ సదస్సులో జేపీఎన్‌ఈసీ విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జాతీయస్థాయిలో జరిగిన సదస్సుకు జేపీఎన్‌ఈసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు కళాశాల తరఫున చక్కటి ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆకళాశాల చైర్మన్ రవికుమార్, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, గురురాఘవేందర్, ఆదిత్యసాయి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి

- మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి శివేంద్రప్రతాప్



కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డు పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న శివేంద్రప్రతాప్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులోని స్లాటర్ హౌస్‌లో అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి శివేంద్రప్రతాప్ ఆదేశించారు. మంగళవారం బస్తీ దవాఖానా, అసంపూర్తిగా ఉన్న స్లాటర్‌హౌస్ (పశువుల వధశాల)ను తనిఖీ చేశారు. కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులో, టీడీగుట్ట ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్లాటర్‌హౌస్‌కు కేటాయించిన నిధులు వచ్చే నెల 31లోగా ఖర్చు చేయకపోతే వెనక్కి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. కూరగాయల మార్కెట్లో ఇంకా సుమారు రూ.కోటి, స్లాటర్‌హౌస్‌లో రూ.50 లక్షల విలువజేసే పనులు ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టాల్సి ఉందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి బదులిచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం

- ఫ్లైయాష్‌ను వాడొద్దు
- జానంపల్లి, చిన్నాయిపల్లి గ్రామాలు ఆదర్శంగా నిలవాలి
- హౌసింగ్ పీడీ భాస్కర్



జానంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ పీడీ భాస్కర్

గండేడ్/మహమ్మదాబాద్: తక్కువ ఖర్చుతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు హౌసింగ్ పీడీ భాస్కర్ అన్నారు. మంగళవారం గండేడ్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన జానంపల్లి, మహమ్మదాబాద్ మండలంలో చిన్నాయిపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో ఫ్లైయాష్‌ను వాడొద్దన్నారు. సిమెంటు ఇటుకలు గాని ఇతర ఇటుకలను గాని ఉపయోగించుకోవాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జానంపల్లి, చిన్నాయిపల్లి గ్రామాలు జిల్లాలోనే ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వం సూచించిన నమూనా ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇసుకను సరఫరా చేస్తోందని తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, ఆదిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవన్న, ఎంపీఈఓ నరేందర్‌రెడ్డి, హౌసింగ్ డీఈఈ పుష్పలత, ఇరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, నారాయణ, మాజీ సర్పంచ్‌లు లక్ష్మారెడ్డి, గోపాల్, పంచాయతీ కార్యదర్శులు మంగమ్మ, ఫాతిమా పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



గొల్లపల్లిలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని ఆలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపించారు. గ్రామానికి చెందిన శివమాలధారులు ఇరుముడి ధారణ పురస్కరించుకొని ఆలయంలో శివుడికి అభిషేకాలు జరిపించారు. గురుస్వాములు విజయ్‌కుమార్, కృష్ణయ్య ఆధ్వర్యంలో ముందుగా గణపతి, కలశపూజ చేసి తరువాత శివపార్వతుల ఉత్సవవిగ్రహాలను ప్రతిష్ఠించి కల్యాణం జరిపించారు. ప్రతి ఏటా శివరాత్రికి ముందురోజు శివపార్వతుల కల్యాణం నిర్వహించటం ఆనవాయితీ. భక్తుల శివ నామస్మరణల మధ్య పడిని వెలిగించారు. భక్తులు తన్మయత్వంతో నృత్యాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

మీనాంబరం పరుశవేదీశ్వరాలయంలో..

మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకొని మంగళవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా గణపతిపూజ, పుణ్యాహవాచనము, అఖండ దీపస్థాపన, రుద్రాభిషేకం, రుద్రహోమం చేశారు. హోమం పూర్ణాహుతి సమర్పించారు. వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పద్మశాలీయులకు అండగా ఉంటా



అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలరాజును సన్మానిస్తున్న యూత్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పద్మశాలీయులకు అండగా ఉంటానని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలరాజు అన్నారు. పద్మశాలి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంఘం కార్యాలయంలో బలరాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పద్మశాలిలు తమ హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పట్టణ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నలి వెంకట్‌కిషోర్, నరేష్, సుకుమార్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

దేవరకద్ర: మండలంలోని కోయిల్‌సాగర్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్షలకు సంబంధించి ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు చందుగౌడ్‌తో పాటు శ్రీనివాస్‌గౌడ్, చంద్రకళ దంపతులు వీటిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేశ్‌నాయక్, ఉపాధ్యాయులు రాఘవేందర్, రామకృష్ణారెడ్డి, కనకప్ప, సుదర్శన్, స్వరూపరాణి పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

మిడ్జిల్: 19వ విడత కిసాన్ సమ్మాన్ నిధి రైతుల ఖాతాల్లో జమ చేయడంపై మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడారు. మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు నిరుపేదలకు సకాలంలో చేరడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. నరేష్‌నాయక్, శేఖర్‌రెడ్డి, అరవింద్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన బైక్: నలుగురికి గాయాలు

జడ్చర్ల టౌన్: మండలంలోని నసురుల్లాబాద్ సమీపంలో మంగళవారం ఉదయం ఆటోను బైక్ ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. నసురుల్లాబాద్‌కి చెందిన 10వ తరగతి విద్యార్థి తనతండ్రి బైక్‌పై ఇద్దరుమిత్రులను ఎక్కించుకొని వేగంగా వస్తున్నాడు. జడ్చర్ల నుంచి ఆవంచ వెళ్తున్న ఆటోను ఢీకొట్టాడు. ప్రమాదంలో బైక్ నడుపుతున్న విద్యార్థితో పాటు ఆటోలో ఉన్న ముగ్గురు ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. బైక్ నడుపుతున్న విద్యార్థి కాలు, చేయి విరగగా బుద్దసముద్రం హెచ్‌ఎం జ్యోతికి చేయి విరిగింది. నసురుల్లాబాద్ ఉపాధ్యాయురాలు భారతికి స్వల్పగాయాలయ్యాయి. ఆటోలో ముందు కూర్చున్న తిరుపతయ్య అనే దివ్యాంగుడికి కాలుచేయి రెండు విరిగాయి. క్షతగాత్రులు రాత్రి పోలీసులకు ఫిర్యాదుచేశారు.

స్క్రాప్ దుకాణం సీజ్



స్క్రాప్ దుకాణాన్ని సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీడీగుట్ట ప్రాంతంలో మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న ఓ స్క్రాప్ దుకాణాన్ని మంగళవారం మున్సిపల్ సిబ్బంది సీజ్ చేశారు. గతంలోనూ ఈ దుకాణదారు వివిధ పాత ఇనుప సామగ్రి, ప్లాస్టిక్, ఇతర వస్తువులను నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైనే ఉంచడంతో పాటు వాటిని డీసీఎం వ్యాన్‌లో లోడింగ్ చేసే సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తగా కలెక్టర్ విజయేందిర బోయి స్వయంగా పరిశీలించి సీజ్ చేయించారు. ఆ తర్వాత కొందరు రాజకీయ నాయకుల సిఫారసు మేరకు ఈ దుకాణం తెరవడం గమనార్హం. తాజాగా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఈ మార్గంలో వెళ్తూ గమనించి మరోసారి దీనికి తాళం వేయించారు.